"బావా! నిజమేనా"

"అవున్రా! వట్టినే నిన్ను బెదరగొడదామని అన్నాను"

నాలో వెయ్యి లైటుహౌస్లు దారిజూపాయి! మంచంమీంచి గప్పున గెంతాను. మరో నిమిషంలో ఇంట్లోంచిపరిగెట్టాను. బావఅక్కయ్య నిర్ఘాంతపోయి చూస్తునిల్చున్నారు!

పరిగెట్టాను ఎంతో దూరం చెట్లతోపులో కెళ్ళాను.

ఆ చెట్టుక్రింద నిర్మానుష్యంగావుంది దగ్గరకువెళ్ళా టార్చిలైటుకాంతిలో అనుకోకుండా ఆప్రదేశాన్ని పరిశీలనగా చూశాను.

ఎవరో అక్కడ అంతకుక్రితం వచ్చిపోయినట్లు గుర్తులు కనిపించాయి. గడియారం చూసుకున్నాను రాత్రి రెండు గంటలైంది.

తిరిగి క్రిందకు వంగాను.

ఎర్రటి గాజుముక్కలు రాణివి ఆగాజులు! క్రితంరాత్రి నేను, ఆమె చేతులకుండగా చూశాను చంద్రకాంతిలో.

మరింత పరిశీలనగాచూశాను. అనుమానం ఎక్కువైంది, ఆత్రుత, ఆవేశం, ఉద్వేగం, వికలత్వం నన్నావరించాయి.

రక్తపుబొట్లు!

పది పంద్రెండు గజాలదూరంలో రక్తసిక్తమైన గొడ్డలి—

'రాణీ' అంటూ ఓ వెర్రికేకపెట్టింది నా మనస్సు.

బావ నన్ను పట్టుకున్నాడు. అక్కయ్య కూడా వుంది.

అక్కడే కూలపడిపోయాను చీకట్లో.

మర్నాడుదయమే ప్రయాణమైనాను, అక్కయ్య వుండమని బ్రతిమాలింది. ఆమె కళ్ళలో నీళ్లు సుడులుతిరగడం నేను చూడకపోలేదు.

"అక్కయ్యా! మీకు ట్రాన్స్ఫర్ అయితే తప్పకుండా వస్తాను" అంటూ రైలెక్కాను. రోజల్లా రైలు అడవులగుండా పాములా పరిగెడుతోంది కిటికీలోంచి చూస్తున్న నాకు దూరంగా, చీకట్లో ఏదో ఆకాశం కన్పించినట్లు నవ్వింది. పలువరున తళుక్కుమంది. కళ్ళంబడి నీళ్ళుకారాయి! రాణీ ఏడుస్తోంది!!

నా ఊహ రైలుకూతలో కలిసిపోయింది.

రాణీ చీకట్లో పరిచయమై, అమాయకంగా ఆ చీకటికే బలయిపోయింది—చీకటికి బలి!!

★

# సౌందర్యపిపాసకులు

రచన: తాళ్ళూరి జయదేవ్

చిన్ననాటి స్నేహితుడు 'రవి' వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఉత్తరంతోబాటు రవి శుభలేఖ కూడ వచ్చింది. చాలాకాలం అయింది మిత్రుణ్ణికలసికొని. కాస్త మంచిచెడ్డా మాట్లాడుకున్నట్లవుతుంది పుణ్యం పురుషార్ధ మరెందుకైనాగాని పెళ్లిభోజనాలకు ఒకవారం రోజులు ముందుగా తిష్టవేయుట మంచిది.

ఒకనాటి సాయంకాలం నేను నామిత్రుడు నూతన వరుడు బంధువులను అందుకునేందుకు బస్సుస్టాండువద్దకు వెళ్లాము. బందరు బస్సు రావటం ఆలస్యమయింది. మేమిద్దరం ఒకచెట్టునీడన నిలబడి పిచ్చాపాటి మాట్లాడుకొంటున్నాము. ఇంతలోకి మా దగ్గరసా ఒక బస్సు నిదానంగా కదలిపోతున్న కారణంగా మా సంభాషణకు అంతరాయం కలిగింది. మాకళ్ళు బస్సులోవున్న జనసమూహాన్ని నిశితంగా చూస్తున్నాయి. ఉన్నట్టుండి నా కళ్ళు బస్సులోనుండి చెయ్యి బయటకు జారవేసిన ఒక విలాసినిపై పడింది. ఆమెచెయ్యి నిగనిగ మెరుస్తూ చెయ్యివేస్తే జారుతుందా అన్నంత నునుపుగనున్నది. చేతికి మరింత వన్నెతెచ్చే గాజులు. "అబ్బ! ఆ చేతిని ఒకసారి నా చేతితో స్పృశించి ఎంత నున్నగా ఉందో చూస్తారా!" మా వాడితో అంటూ ముందు వెనుక ఆలోచించకుండా కార్యాచరణలోపెట్టనున్న సమయంలో కొంపతీసి అంతపని చెయ్యకు అంటూ నన్ను దూరంగా లాక్కువెళ్ళాడు వ్యధితహృదయంతో.

"సరిగా నీకు కలిగినట్లుగానే నాకొక దుర్బుద్ధికలిగింది. ఆ సంఘటన ఈ జన్మకు మరువలేను" అంటూ తన పూర్వానుభవాన్ని చెప్పసాగాడు

"అవి నేను గుంటూరులో చదువుకునే రోజులు. ఒకనాటి సాయంత్రం నేను ఒక మిత్రుడు మస్తాన్ ఉరుసు ఉత్సవాలు చూట్టానికి వెళ్ళుతున్నాము. జనసమ్మర్ధం విరివిగానున్నది. భుజాలమీదచేతులువేసికొని సర్దాగా మాట్లాడుకుంటూ ముందుకిసాగిపోతున్నాము. ఉత్సవాలకు వచ్చేవాళ్ళలో రకరకాల జనం ఉంటారు. ఎటువంటివారైన ఆ పరిసరాలకు పరిస్థితులకు కొంత ప్రచలితులౌతారు. విటులు విలాసినులు వీరి చూపులనుండిదాటుకుంటూ పోతున్నాము. మా కెదురుగుండా ఒక కన్య పడుచు నవవయ్యారంగా నడుస్తూ బెదురు చూపులుచూస్తూ మా వైపుకేసివస్తుంది. ఆమె లేతబుగ్గలు మిలమిల నాలో విపరీతబుద్ధి పుట్టించింది. 'ఆమె బుగ్గమీద చిటికెవేస్తే?' అని మనస్సులోకి రావటం ఆమె మా దరిదాపుల్లోకి రావటం నేను చిటికెవేసి మా వాడి భుజంమీదనుండి నా చెయ్యి తీసివేయటం అంతా యాంత్రికంగా జరిగిపోయింది. తత్ఫలితంగా నా మిత్రుడిచెంప 'ఫెళ్ళు' మన్న శబ్దానికి తెప్పరిల్లుకున్నాను. ఆమె మావాడిని కొట్టి "నీకు అక్కలు, చెల్లెళ్ళు .... లేరు' ' అంటూ బోరున యేడుస్తుంటే మా వాడికి అంతా అయోమయంగా వుంది. జనంపోగవుతున్నారు ఒక్కొక్కరే. "ఏమిటి నీవు వాగేది పిచ్చా యేమన్నా?" అంటున్న నా మిత్రుణ్ణి అచ్చట చేరిన అందరూ ఆమెద్వారా వృత్తాంతము తెలిసికొని మా వాడ్ని చివాట్లుపెడుతుంటే నా గొంతులో పచ్చివెలక్కాయ అడ్డం పడినంతపని జరిగింది. అసలు సంగతి చెప్పుదామనుకున్నా. కాని ఎటు మాట్లాడినా ప్రమాదమే. ఆ తరువాత యేదైతే జరిగిందో అదంతా చెప్పటంకంటే సూక్ష్మంగా చెపుతా. అంతా కలిసి మా వాడిని మాలిష్ చేశారు. పోలీసుల విజిల్ చప్పుడు విని సమూహం చెదిరిపోయింది. వెంటనే మావాడిని రిక్షాలో వేసికొని రూమ్‌కు తీసికొనివెళ్ళి గాయాలకు చికిత్సచేశాను. వాడ్ని చూస్తుంటే జాలి, నామీద నాకు అసహ్యంవేసింది. అది మొదలుకొని వాడ్ని చూసినప్పుడు నా కా సంఘటన సినీమారీలులా తిరిగి వ్యధగా వుంటుంది అని వాడు చెపుతుంటే మధ్యలో నే నందుకొని "నీవు ఇప్పుడు నన్ను వారించకపోయినట్లయితే ఇవ్వాళ అంత రభసా జరిగేదేమో! ఎవరో కవి అన్నమాటలు గుర్తుకు వస్తున్నాయి" అంది అందనిదే ఆనందమని. అందాన్ని చూడు కాని చెడగొట్టకు. హద్దులు మించితే పరిస్థితి పైవిధంగా జరగటంలో విపరీతం లేదేమో! ★